క్లుప్తంగా

చెరువు తవ్వకం పనులను ఆపండి

పెడన: చెరువు తవ్వకం పనులను తక్షణం నిలుపుదల చేయాలని, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎటువంటి పనులు చేయవద్దని పెడన తహసీల్దార్ ఆర్. రాంబాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని నందిగామ పంచాయతీ పరిధిలో సుమారు 30 ఎకరాలలో చెరువు తవ్వకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వీటి పక్కన శ్మశాన వాటిక ఉండటంతో దానికి సంబంధించిన కొంతమంది జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేయడంతో అక్కడ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తహసీల్దార్ రాంబాబు విచారణ చేపట్టారు. వాస్తవంగా మూడు మీటర్లకు బదులుగా శ్మశాన వాటికకు ఆరు మీటర్లు దూరంగా పనులు ప్రారంభించినట్లుగా గుర్తించి తహసీల్దార్ నివేదికను కలెక్టర్‌కు పంపించారు. ఎటువంటి ఇబ్బంది లేదని సదరు శ్మశానవాటికకు సంబంధించిన వారి నుంచి లిఖితపూర్వకంగా వారి స్టేట్‌మెంట్‌ను తీసుకుని కలెక్టర్‌కు పంపించామన్నారు. కలెక్టర్ తదుపరి అనుమతులు జారీ చేసే వరకు పనులు నిలుపుదల చేయాలని సూచించినట్లు తహసీల్దార్ రాంబాబు పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపుపై రేపు శిక్షణ

పెడన: సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జూన్ నాలుగో తేదీన కృష్ణా యూనివర్సిటీలో జరగనున్న నేపథ్యంలో పెడన నియోజకవర్గానికి సంబంధించి లెక్కింపు సిబ్బందితో పాటు అభ్యర్థులు, ఆయా పార్టీల ఏజెంట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు పెడన ఎన్నికల అధికారి పి. వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు మచిలీపట్నంలోని లేడీ యాంప్తిల్ జూనియర్ మహిళా కళాశాలలో జరిగే ఈ శిక్షణకు సంబంధించి పెడన అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు పెడనలో పార్లమెంటు లెక్కింపునకు హాజరయ్యే సిబ్బందికి, ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వాతంత్ర్య అభ్యర్థులు, వారి ఏజెంట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తప్పనిసరిగా శిక్షణకు హాజరై ఎన్నికల నియమనిబంధనలను తెలుసుకోవాల్సిందిగా సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగాయలంక: మండలంలోని ఏటిమొగ సబ్ స్టేషన్ పరిధిలో గుల్లలమోద, ఏటిమొగ, పెద కమ్మవారిపాలెం, ఎదురుమొండి, నాచుగుంట, జింకపాలెం తదితర గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ జి.ఏడుకొండలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33కేవీ లైన్ల మరమ్మతు పనులు, తీగలపై పడుతున్న చెట్లు కొట్టడం పనులు చేపడుతున్న కారణంగా ఉదయం 6గంటల నుంచి 10.30వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు, రేపు అంకాల దేవర అమ్మవారి జాతర



భావదేవరపల్లి (నాగాయలంక): గ్రామంలో కొలువై ఉన్న గ్రామదేవత శ్రీఅంకాల దేవర అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మారెడ్డి సత్యనారాయణ(సత్తిబాబు)శుక్రవారం తెలిపారు. శనివారం పోతురాజుస్వామి, ఉర్వేళమ్మ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి పూజలు జరుపుతారు. సాయంత్రం నుంచి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం అమ్మవారి సంప్రదాయక రీతిలో గుడి జాతర ఉత్సవం ఆచార వంతులచే ఆరంభం అవుతుంది. తదుపరి భక్తుల మొక్కుబడులు, చద్ది నైవేద్యాల సమర్పణ ఉంటాయి. జాతరకు వచ్చిన భక్తులందరికీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తారు.

చలివేంద్రం ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఇంగ్లిష్‌పాలెంలో మోడ్రస్ ఐ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదచారులకు మజ్జిగను, నల్ల కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకుడు ఎండీ రియాజ్, యూనస్‌లు మాట్లాడుతూ ఇంగ్లిష్‌పాలెంలోని ఆర్‌సీఎం చర్చి రోడ్డులో పోలీస్‌స్టేషన్లు, కలెక్టర్ కార్యాలయం ఉండటంతో ప్రజలు ఎక్కువగా సంచరిస్తున్నారని అధిక ఎండలతో తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను తీర్చేందుకు తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

మోపిదేవి: ఎండలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చల్లని మజ్జిగ పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని మండల గృహనిర్మాణశాఖ ఏఈ రాజులపాటి తాండవ కృష్ణ అన్నారు. మండల కేంద్రం మోపిదేవి ప్రధాన గుడిసెంటర్‌లో ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు సంఘం, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. సచివాలయ మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు ఆర్థిక సహకారంతో 6వ రోజు శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



కోడూరులో ముస్తాబైన అభయ ఆంజనేయుడు



బంటుమిల్లి సెంటరులో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న శివస్వామి



ఉత్సవమూర్తులకు కలశాభిషేకం చేస్తున్న వేదపండితులు



ఆకుపూజ చేస్తున్న దంపతులు

బంటుమిల్లి: సనాతన ధర్మం, హైందవ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలంటే దాని రక్షణకు నేటి తరం నడుం బిగించి సంఘటితం కావాలని గుంటూరు జిల్లా తాళ్లాయిపాలెం శ్రీశైవ మహాపీఠం పీఠాధిపతులు శివస్వామి అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బంటుమిల్లి హిందూ శోభాయాత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శోభాయాత్రలో స్వామిజీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంటుమిల్లి కూడలి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హైందవ సమాజం సంఘటితంగా చేసిన పోరాటమే అయోధ్యలో బాలరాముడి దేవస్థానం నిర్మాణమన్నారు. శోభాయాత్రలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాల నుంచి వందలాది మంది కార్యకర్తలు, భక్తులు పాల్గొని కాషాయధ్వజాలను ధరించి నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక శ్రీపద్మావతి గోదాసమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద యాత్రకు పూజలు నిర్వహించి జెండా ఊపి శివస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హనుమజ్జయంతి పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నగరంలోని బచ్చుపేట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ఉదయం కదలి ఫలార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కామెడీ స్కిట్స్‌కు భక్తులను నవ్వించాయి. అలాగే చిరంజీవులు పావని, జ్ఞానశ్రీ ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. జూన్ 1వ తేదీ శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ఆలయాల్లో స్వామివారికి పంచామృత అభిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వైభవంగా కలిశాభిషేకం

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీసువర్చల ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఉత్సవమూర్తులకు, ప్రధాన మూర్తులకు 108 కలిశాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పండితులు డీవీ మేఘనరసింహకుమార్, రొంపిచర్ల హనుమంతాచార్యులు శిష్య బృందం వేద మంత్రాలు మధ్య అభిషేకాలు జరిపించారు. పలు నదులకు చెందిన నీరు, పలు ప్రాంతాలకు చెందిన మట్టి, శాస్త్రబద్ధమైన పలు రకాల ద్రవ్యాలతో 108 కలశాలను పూజించి అభిషేకాలు చేశారు. తొలుత హనుమాన్ జయంతి పారాయణంలో భాగంగా 46వ రోజు ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని చాలీసా పారాయణం పఠించారు.

అభయాంజనేయుడికి ఆకుపూజ

భావదేవరపల్లి(నాగాయలంక): హనుమత్ జయంతి ఉత్సవాలలో భాగంగా గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో శుక్రవారం నాలుగో రోజు విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణకర్త మలిశెట్టి సాంబశివ రావు(నామాలు)పర్యవేక్షణలో ఆలయంలో బ్రహ్మశ్రీ ముదునూరి అచ్యుతశర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక ఆకుపూజ జరిపారు. మత్తి బసవయ్య కుటుంబ సభ్యులు పీటలపై కూర్చుని పూజాధికాలు నిర్వహించారు. గ్రామస్తులు స్థానిక భజన బృందం నేతృత్వంలో హనుమాన్ చాలీసా పారాయణం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిపించారు. శనివారం హనుమాన్ జయంతి పురస్కరించుకుని మహా అన్నసంతర్పణ జరుగుతుందని భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని నామాలు విజ్ఞప్తి చేశారు.

నేడు రేమాలవారిపాలెంలో..

నాగాయలంక సమీపాన రేమాలవారిపాలెం వంతెన సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో జయంతి వేడుకలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, 108సార్లు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, అన్నసంతర్పణ ఉంటుందన్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

కృత్తివెన్ను: ఆంజనేయస్వామివారి ఆలయాల్లో శనివారం నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని గాంధీనగరం, నీలిపూడి, అడ్డపర్ర, ఒంటిళ్లు, సంగమూడి తదితర గ్రామాలలో ఆంజనేయ స్వామి ఆలయాలను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఐదురోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. గాంధీనగరం గ్రామంలోని శ్రీ అభయ ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద ఉదయం కలశస్థాపన పూజలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆలయాలు ముస్తాబు..

కోడూరు: హనుమాన్ జయంతి వేడుకలకు ఆంజనేయుడి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. కోడూరు వంతెన సెంటర్‌లోని అభయ ఆంజనేయస్వామివారి దేవాలయం వద్ద శుక్రవారం సాయంత్రం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణాన్ని భక్త బృందాలు నిర్వహించాయి. స్వామివారి మూలమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం స్వామివారి అభిషేకాలు, ప్రత్యేక అలంకారాలు, అన్నసమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు. లింగారెడ్డిపాలెం, పాదాలవారిపాలెం, ఉల్లిపాలెం, నక్కవానిదారి, జరుగువానిపాలెం, స్వతంత్రపురం, జయపురం, వి.కొత్తపాలెం, మాచవరం, విశ్వనాథపల్లి, పిట్టల్లంక గ్రామాల్లోని ఆంజనేయుడి ఆలయాలను నూతన రంగులతో తీర్చిదిద్ది, విద్యుత్‌దీపాలతో అలంకరించారు. శనివారం ఆలయాల వద్ద స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మ తల్లి గ్రామోత్సవం



అంకమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకుంటున్న భక్తులు

కె. కొత్తపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కె. కొత్తపాలెంలో కృష్ణానది ఒడ్డున వేంచేసియున్న అంకమ్మ తల్లి గ్రామోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జంపాన వారి దేవతగా పేరుగాంచిన అమ్మవారిని ఉదయం మేళతాళాలు, డప్పుకళాకారుల సందడుల మధ్య సంబరం నిర్వహించారు. పసుపు, కుంకుమ, టెంకాయలతో పాటు భక్తులు సిద్ధం చేసిన పలు రకాల పిండివంటలు, ఆహార పదార్థాలను అమ్మవారికి నైవేద్యాలుగా సమర్పించారు. అక్కడ నుంచి ఊరేగింపుగా గ్రామ దేవతలు పోతురాజు, ఓలేరమ్మ, ఘంటాలమ్మ, మావెళ్లమ్మ, రామాలయం, ఆంజనేయస్వామివారి ఎదుట సంబరాలు నిర్వహించారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ఉత్సవం కావడంతో బంధుమిత్రులతో గ్రామంలో పెద్ద పండగ వాతావరణం నెలకొంది. ఆలయం వద్ద పెద్ద ఎత్తున సంబరాలు చేసి నైవేద్యాలు సమర్పించుకున్న అనంతరం అమ్మవారు ఆలయ ప్రవేశం చేశారు. కమిటీ అధ్యక్షులు జంపాన మాణిక్యాలరావు, పడమట సుబ్బారావు, పడమట వెంకటేశ్వరావు, రెడ్రౌతు రవిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పగిలిన పైపు.. తాగునీరు వృథా



విరిగిన కుళాయి నుంచి ఎగజిమ్ముతున్న నీరు పట్టుకుంటున్న మహిళ

చల్లపల్లి: చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నారాయణరావు నగర్ కాలనీలో తాగునీటి కుళాయి విరిగిపోయి నీరు వృథాగా పోతోంది. కుళాయి హెడ్‌తో సహా పూర్తిగా విరిగిపోవటంతో తాగునీరు పైకి ఫౌంటేన్, గ్యాస్ బ్లో-ఔట్ మాదిరిగా ఎగజిమ్ముతోంది. ఈ కుళాయి వద్ద నీరు పట్టుకోవటం స్థానికులకు సమస్యాత్మకంగా మారుతోంది. పంచాయతీ సిబ్బంది కుళాయి మరమ్మతులు చేస్తున్నా, ఆకతాయిలు పదేపదే కుళాయి విరగగొట్టేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ఐరన్ పైపు, ఐరన్ హెడ్‌తో కుళాయి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు శిక్షణ



రుచికరమైన వంటలు చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందిస్తున్న డీవైఈఓ శేఖర్ సింగ్

గూడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న వంట ఏజెన్సీలకు శుక్రవారం గూడూరులో ఒకరోజు వర్క్ షాపు నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వర్క్‌షాప్, కుకింగ్ కాంపిటీషన్‌కు ముఖ్యఅతిథిగా బందరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి బీఎస్‌సీ శేఖర్‌సింగ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి బడిలోనే మధ్యాహ్న భోజనం తినేలా రుచికరమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత ఏజెన్సీలపై ఉందన్నారు. మెనూ ప్రకారం రోజు వారీ వంటలో వినియోగించాల్సిన పదార్థాల పరిమాణాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ద్వారా ఆహారం రుచికరంగా ఉంటుందన్నారు. వర్క్ షాపులో మెనూ ప్రకారం వండాల్సిన వంటపై ఐఎఫ్‌పీ ద్వారా శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించి రుచికరమైన వంటలు చేసిన వారికి ప్రశంసా పత్రాలు బహూకరించారు. కార్యక్రమంలో గూడూరు ఎంఈవో-2 సుబ్రహ్మణ్యం, సీఆర్పీలు ఏడుకొండలు, దుర్గాప్రసాద్, సురేష్, సుబాని, ఏసుబాబు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఏఓ రాజు సేవలు ప్రశంసనీయం



ఏఓ రాజును సత్కరిస్తున్న ఎంపీపీ సుప్రజ, ఎంపీడీఓ సుభాని

పమిడిముక్కల: వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందిన మండల పరిషత్ ఏఓ కేఎస్‌డీ రాజు సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ కాసాని వేద సుప్రజ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ సుభాని ఆధ్వర్యంలో ఏఓ రాజు ఉద్యోగవిరమణ సభను నిర్వహించారు. రాజు 30 సంవత్సరాల సర్వీస్‌లో వీడీఓగా, కార్యదర్శిగా 22 సంవత్సరాలు పమిడిముక్కల మండలంలోనే పనిచేయడం, చివరకు ఏఓగా ఇక్కడే పదవీ విరమణ చేయడం సంతోషకరమని ఉద్యోగులు పేర్కొన్నారు. రాజు సేవలను కొనియాడారు. మండలంలో 25 పంచాయతీలు ఉండగా 23 పంచాయతీల్లో పనిచేశానని, ఉద్యోగ నిర్వహణలో తనకు సహకరించిన వారందరికీ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఏఓ రాజును ఎంపీపీ సుప్రజ, ఎంపీడీఓ సుభానీ, ఈఓఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, తోట్లవల్లూరు ఎంపీడీఓ సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంఈవోలు పద్మారాణి, శ్రీనివాస్ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

విద్యార్థినికి సత్కారం

పామర్రు: పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి, మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినిని శుక్రవారం పామర్రు ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక యలమర్రు రోడ్డులో ఉన్న ఏఎస్ఎం హైస్కూల్ విద్యార్థిని జ్యోత్స్న పదో తరగతిలో 583 మార్కుల సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించిన నేపథ్యంలో జ్యోత్స్న సత్కరించామని తెలిపారు. అనంతరం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏ పూర్ణ చంద్రారెడ్డి విజేత అయిన విద్యార్థినికి రూ.25,558 నగదు పురస్కారాన్ని అందజేశారు. కళాపీఠం అధ్యక్షుడు ప్రిన్సిపాల్, విద్యార్థినిని సత్కరించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంతో పాటు సబ్ డివిజన్‌లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పి.శ్రీకాంత్ హెచ్చరించారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ కె.ఇంద్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుడివాడలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కౌంటింగ్ రోజున ఎటువంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా వన్‌టౌన్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంతో పాటు, సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులను ఇప్పటికే అప్రమత్తం చేశామన్నారు. ఈ నెల నాల్గో తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో ఉండాలన్నారు. ఎటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడకూడదని సూచించారు. సాధారణ నేరాల్లో ఉండే ఇబ్బందుల కన్నా ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ప్రతి ఎన్నికల్లో అటువంటి వారిపై ప్రత్యేక దృష్టి ఉంటుందని, వాటిని నాయకులు, కార్యకర్తలు కూడా దృష్టిలో పెట్టుకుని పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక విజయోత్సవ ర్యాలీలు, టపాసులు కాల్చేందుకు కూడా ఎలక్షన్ కమిషనర్ అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. సమావేశంలో వన్, టూటౌన్ సీఐలు కె.ఇంద్రశ్రీనివాస్, ఎంపీ దుర్గారావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గుడివాడటౌన్: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి అని గుడివాడ బీకేఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ గౌరీ మణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసైన, ఎనిమిదో తరగతి పాసైన అభ్యర్థులకు వివిధ కోర్సుల్లో ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా కన్వీనర్ కార్యాలయం గుడివాడ (కేబీఆర్ ఐటీఐ కాలేజ్) 08674-295953, 8555952320ను సంప్రదించాలని కోరారు.

పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 60 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఏ. పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 33 మంది, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 27 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చినట్లు పేర్కొన్నారు. వీరికి హెచ్‌ఎల్ మాండో, జీఈ ఏరోస్పేస్, శుభ్రోస్ లిమిటెడ్, రాయల్ ఎన్‌ఫీల్డ్, ఆర్ సెల్లార్ మెటల్ స్టీల్, నిప్పాన్ స్టీల్ ఇండియా, అపోలో టైర్స్ లిమిటెడ్, మేధా సర్వోడ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగం లభించినట్లు తెలిపారు. విద్యార్థులకు నియామక పత్రాలు కూడా అందజేసినట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను, వీరిని ప్రోత్సహించిన విభాగాధిపతులు, అధ్యాపకులను ఆమె అభినందించారు.

ఉచిత యోగా శిక్షణ శిబిరం

పెనమలూరు: శ్రీవేంకటేశ్వర యోగా సేవా కేంద్ర ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వివరాలు తెలుపుతూ శ్రీవెంకటేశ్వర యోగి గురూజీ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీ నుంచి 28 రోజుల పాటు ఉచిత యోగా శిక్షణ ఉంటుందన్నారు. పెనమలూరు సెంటర్ కిలారు అనీల్ ఎస్టేట్‌లో ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 91333 06804ను సంప్రదించాలని సూచించారు.



రద్దీగా ఉంటే బస్టాండ్ సెంటరులో మూసి ఉన్న దుకాణాలు



నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

భానుడి కర్ఫ్యూ

రోహిణీ కార్తె ప్రభావంతో బందరులో కొద్ది రోజులుగా ఎండలు మండుతున్నాయి. ఉదయం నుంచే అధిక ఎండ కాస్తుండటంతో పాటు ఉక్కపోతతో నగర ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కూలర్లు, ఏసీలను విరివిగా వినియోగిస్తున్నారు. ఈ నెల 25వ రోహిణీకార్తె కాగా.. తుపాను ప్రభావంతో ఆ రోజు వాతావరణం చల్లగా ఉంది. ఆ తర్వాత రోజు నుంచి ఈ సీజన్‌లో అధిక ఎండలు నమోదవుతుండటంతో ఇబ్బంది పడుతున్నారు. వేడికి తోడు వడగాడ్పులు వీస్తుండటంతో నగరంలో ప్రజల సంచారం తగ్గింది. ప్రధాన రహదారుల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. వ్యాపారాలు లేక దుకాణాలను మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మూసి ఉంచుతున్నారు.

– మచిలీపట్నంటౌన్